క్లుప్తంగా

గాజుల అలంకరణలో సత్తెమ్మ తల్లి



గాజుల అమ్మవారిగా సత్తెమ్మ తల్లి

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారు ఆదివారం గాజుల అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో సత్తెమ్మ తల్లి అమ్మవారిని సుంకర శ్రీనివాస్ సమకూర్చిన రంగు రంగుల గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గాలి దేవర రాధాకృష్ణ బూరెలు, తోట వెంకటేశ్వరరావు పులిహోర, ఆకుల ఈశ్వరరావు, నిమ్మకాయల వెంకట దుర్గా మహేష్ చక్కెర పొంగలి నైవేద్యంగా సమర్పించారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం(పీఎంఏవై) ద్వారా పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్థిక సహాయ చెక్కులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మురికివాడల అభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్జీగా కైలాష్‌నాథన్ నియామకం



నూతన ఎల్జీ కైలాష్‌నాథన్

యానాం: పుదుచ్చేరి నూతన లెఫ్టినెంట్ గవర్నర్‌గా 1979 బ్యాచ్ గుజరాత్ కేడర్ మాజీ ఐఏఎస్ అధికారి కైలాష్ నాథన్‌ను నియమిస్తూ ఆదివారం రాష్ట్రపతిభవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 72 ఏళ్ల కై లాషనాథన్ 2013 వరకూ గుజరాత్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వహించారు. గుజరాత్‌లో కీలక ప్రాజెక్టులైన గిఫ్ట్ సిటీ, సర్దార్ సరోవర్ నర్మదా నిగమ్ లిమిటెడ్, గాంధీ ఆశ్రమం డెవలప్‌మెంట్‌లకు చైర్మన్‌గా వ్యవహరించారు.

ఘనంగా తెలుగు సాహితీ వనం వార్షికోత్సవం



కవులు రాంబాబు, మల్లాడి శ్రీనివాసరావులను సత్కరించిన ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

కాట్రేనికోన: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీ అంతర్జాతీయ కార్యవర్గం ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతీ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం తెలుగు సాహితీ వనం 7వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. తెలుగు సాహితీ వనం వార్షికోత్సవంలో కాట్రేనికోనకు చెందిన చింతా రాంబాబు, మల్లాడి శ్రీనివాసరావులను ప్రముఖ సాహిత్య విమర్శకులు ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సినీ రచయిత మౌనశ్రీ మల్లిక్ చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, కవయిత్రి శాంతికృష్ణ, సత్యాజీ, పాతూరి అన్నపూర్ణ, చమన్, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు పాల్గొన్నారు.

లాస్విక్‌కు సర్పంచ్‌ల సాయం



బాలుడికి ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్‌లు

అమలాపురం రూరల్: రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు బత్తుల లాస్విక్ ఆడుకుంటూ డాబా పైనుంచి కిందకు పడిపోయాడు. ప్రమాదంలో బ్రెయిన్‌లో నరాలు చిట్లి రక్తం గడ్డకట్టడంతో ప్రస్తుతం కిమ్స్ ఎమర్జెన్సీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి వైద్య సేవల కోసం అమలాపురం మండలంలో సర్పంచ్‌లు పెనుమాల సునీత, కరాటం ప్రసన్న ప్రవీణ్, గంగుమళ్ల ఏసుబాబు, చెల్లుబోయిన నాని, గోకరకొండ వాసు తదితరులు బాలుడిని ఆదివారం పరామర్శించి మెరుగైన వైద్యం నిమిత్తం రూ.8,000 ఆర్థిక సాయం అందించారు.



ఎదుర్లంక వద్ద గౌతమి నదీపాయలో వరద ఉధృతి



రాఘవేంద్ర వారధి వద్ద వృద్ధ గౌతమిలో వరద



కేశనకుర్రులో నీట మునిగిన వరిచేలు



కొత్తలంక గ్రామంలోకి చేరిన వరదనీరు

వరద.. వర్షం ముంచేస్తున్నాయి

- ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న గౌతమి, వృద్ధ గౌతమి
- గంట గంటకూ పెరుగుతున్న వరద తీవ్రత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంపు గ్రామాల ప్రజలు



అన్నంపల్లి వద్ద నివాస గృహాలను ముంచెత్తుతున్న వరద

ఐ.పోలవరం: ఉగ్ర గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద తీవ్రత గంటగంటకూ పెరుగుతోంది. మండలం చుట్టూ ఉన్న గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అన్నంపల్లి అక్విడెక్టును తాకుతూ వృద్ధ గౌతమీ ఉరకలు వేస్తోంది. ఒక వైపు గోదావరి వరద.. మరోవైపు భారీ వర్షాలు ఏటిగట్టు దిగువన ఉన్న లంక గ్రామాలను ముంచెత్తుతున్నాయి. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద శ్మశానవాటిక, మత్స్యకార ఇళ్లను వరద ముంచెత్తింది. ఐ.పోలవరం మండలంలోని కేశనకుర్రు పంచాయతీ పరిధిలో పల్లిగూడెం, పొగాకులంక, జాంబవానిపేట, జి.మూలపొలం ఏటిగట్టు వద్ద వరద నీరు చేరుకోవడంతో సుమారు 300 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంట గంటకూ పెరుగుతున్న వరద తీవ్రత దృష్ట్యా సోమవారం నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరదకు తోడు భారీ వర్షాలు సైతం ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. గడిచిన రెండు రోజుల్లో పలు సందర్భాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. నార్త్ అడ్డాల్‌తో పాటు పలు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. చేల నుంచి నీరు దిగే అవకాశం లేకపోవడంతో నాట్లు వేసిన నారుమళ్లు నీట మునిగాయి. ఐ.పోలవరం, కేశనకుర్రు, తిల్లకుప్ప, టి.కొత్తపల్లి, పాత ఇంజరం, సుమారు ఐదు వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పటికే చాలా వరకు పంట దెబ్బతిందని, ముంపు నీరు దిగకపోతే మరింత నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

వరద ముంపులో కొత్తలంక

తాళ్లరేవు: పిల్లంక పంచాయతీ శివారు కొత్తలంక గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. గత వారం రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి ప్రవాహం ఆదివారం ఉదయం నాటికి ఎక్కువ కావడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గ్రామంలోకి వెళ్లే రహదారిని వరద నీరు ముంచెత్తడంతో బోట్లపైనే వెళ్లాల్సి వస్తుందేమోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదనీటి కారణంగా పశువులకు జాగా లేకపోవడంతో గ్రామంలోని సీసీ రహదారులపై పశువులను కట్టేశారు. వరదల కారణంగా పశువులకు దాణా కొరత ఏర్పడే పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామ పరిధిలో ఉన్న ఉద్యాన పంటలన్నీ నీట మునిగాయి. అరటి, వంగ, బెండ, మునగ, మొక్కజొన్న, నువ్వుల చేలు నీటి ముంపులో ఉన్నాయి. ఉద్యాన పంటలన్నీ నీట మునిగి కుళ్లిపోతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, వరద కారణంగా పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు దుక్కిపాటి సత్యన్నారాయణ, కూర్మ అయ్యన్న తదితరులు వాపోయారు. గ్రామంలో తాగునీటి సమస్యే తలెత్తే అవకాశం ఉందని తాగునీటిని సరఫరా చేయాలని, అలాగే పశువులకు దాణా అందించాలని కోరుతున్నారు.

ఉధృతంగా గోదావరి

ముమ్మిడివరం: మండలంలోని వివేకానంద వారధి వద్ద గోదావరి పొంగి ప్రవహిస్తోంది., గురజాపులంక, ప్రధాన రహదారులు ముంపుబారిన పడ్డాయి. రోడ్డుపై నాలుగు అడుగుల మేర నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీటితో మునిగాయి. లంకాఫ్ ఠానేల్లంకలోని మత్స్యకార కాలనీలో నివాస గృహాలను వరద నీరు చుట్టుముట్టింది. లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లి లంక, సలాదివారిపాలెం తదితర గ్రామాలు వరద నీటిలో మునిగాయి. వరద ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీను నాయక్, వీఆర్వోలు స్థానికంగా ఉండి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం జరగాలి

యానాం: యానాం రీజియన్‌లో గోదావరి వరదలకు నష్టపోయిన రైతులకు, ఉపాధి కోల్పోయిన పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన వరద ఉధృతి ఉన్న తీర గ్రామాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు వస్తే బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం, ఏటిగట్ల వెంబడి ఇసుకబస్తాలు సిద్ధం చేయడం, శానిటేషన్, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్ల గురించి ఆర్ఏఓ మునిస్వామితో చర్చించారు. రైతులు ఈ సీజన్‌లో వేలరూపాయల పెట్టుబడులు పెట్టి నారుమళ్లు వేసుకుంటే వరదల వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణం మోటార్లు ఏర్పాటు చేసి ముంపు పొలాల్లో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజును ఆదేశించారు. సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, రైతులు సబ్బతి లోకేష్, సబ్బతి శ్రీను, గిడ్ల వెంకన్న, కోరుకొండ ఆనందరావు, మట్టా రాంబాబు పాల్గొన్నారు.

అధికారులతో మల్లాడి సమావేశం

యానాం నియోజకవర్గ పరిధిలో వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతాలను గుర్తించి సహాయాన్ని అందించేందుకు పీడబ్ల్యూడీ, విద్యుత్, హెల్త్, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, జీజీహెచ్ డీడీ రవిశంకర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరామర్శ

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో వరద ప్రభావానికి గురైన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా 25 కేజీల బియ్యం, ఉల్లిపాయలు, నూనె ప్యాకెట్, బంగాళదుంపలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్, చింతా శ్రీను, ముత్యాల బాబి, డి.సత్తిబాబురాజు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



కొత్తలంకలో అరటి తోటను ముంచెత్తిన వరదనీరు



వరద ముంపులో వంగ తోట



వరదనీరు ముంచెత్తడంతో పశువులను సీసీ రోడ్డుపై కట్టేసిన దృశ్యం



వరద నష్టంపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారిని అంగన్‌గుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి వేషాలు, విచిత్ర వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మండలంలోని పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పోలేకుర్రు, తాళ్లరేవు, మల్లవరం, ప్రత్తిగొంది, జార్జిపేట, యానాం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పి.మల్లవరంలో ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

వరద ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్రేయపురం: గోదావరి వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా వరద ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం ఆత్రేయపురం మండలంలో బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక, పేరవరం, వద్దిపర్రు, వాడపల్లి, వెలిచేరు, రాజవరం తదితర గ్రామాల్లో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లను పరిశీలించి వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఆర్ఐ భవాని, స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి తాగునీరు, పారిశుధ్యం విషయంలో తగు సూచనలు చేశారు. లంక ప్రాంతాల్లో పశువుల కోసం వెళ్లిన రైతులు క్షేమంగా రావడానికి మోటారు బోట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వరద ప్రాంత ప్రజలందరినీ సురక్షితంగా ఉంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రం కేశఖండనశాల వద్ద స్నానాల రేవుకు చేరిన గోదావరి వరద ఉధృతికి భక్తుల స్నానాలకు వేరే ఏర్పాట్లు చేసి గోదావరికి వెళ్లకుండా నిలుపుదల చేసినట్లు ఆలయ ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే రక్షణ కొరకు గజ ఈతగాళ్లను, పడవలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



పిచ్చుకలంక ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకట్రామయ్య

వచ్చే నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలి

యానాం: యుజీ నీట్-2024 పరీక్షలో అర్హత సాధించిన యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్ల అభ్యర్థులు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్(ఆయుర్వేద), బీవీఎస్సీ అండ్ ఏహెచ్(వెటర్నరీ) కోర్సుల్లో ప్రవేశానికి వచ్చే నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సెంటాక్ కోఆర్డినేటర్ అమన్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పుదుచ్చేరిలో ప్రభుత్వ, సెల్ఫ్ ఫైనాన్సింగ్, మెడికల్, డెంటల్, ఆయుర్వేద, వెటర్నరీ కాలేజీల్లో ప్రవేశం ఉంటుందన్నారు. సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా కాలభైరవ హోమం



విలసవిల్లిలో కాలభైరవ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి శ్రీరామ మందిరంలో ఆదివారం ఆషాఢ మాస అష్టమి సందర్భంగా పండితులు ముస్నంగి రామకృష్ణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలభైరవ స్వామి ఆరాధన, కాలభైరవ హోమం అత్యంత శాస్త్రీయంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నడకయాతన

నానా పాట్లు పడుతున్న ప్రజలు

సఖినేటిపల్లి: మలికిపురం నుంచి ఉయ్యూరువారి మెరక, మోరి, శృంగవరప్పాడు మీదుగా కేశవదాసు పాలెం వరకూ ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు కురుస్తున్న వర్షాలకు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఆర్అండ్‌బీ రోడ్డుకు ఉయ్యూరువారి మెరక, మోరి పరిధుల్లో ఆ శాఖ మరమ్మతులు చేపట్టినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. మరమ్మతులు చేసిన చోట ఆర్టీసీ బస్సులు, భారీ లోడ్‌తో వస్తున్న వాహనాలు రాకపోకలకు పెద్ద పెద్ద గోతులు పడి, వర్షాలకు ఆ గోతులు ముంపునీటితో రోజులు తరబడి నిండి ఉండడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా మరమ్మతులు పూర్తి చేసిన ఉయ్యూరువారి మెరక పరిధిలో సినిమా హాల్ సెంటర్ వద్ద, మోరి గాంధీ పార్క్ వద్ద రోడ్డు పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా ఉంది. కాగా ఇదే మార్గంలో శృంగవరప్పాడు ఆంజనేయస్వామి ఆలయం మలుపులో వర్షాలకు రోడ్డు కొంత మేర కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ఈ గ్రామం మీదుగా ప్రయాణించే వారికి ఇక్కడ పెద్ద సమస్యగా ఉంది. దీంతో గ్రామస్తులు చొరవ చూపి ఇటుక బొంతలను తెచ్చి దెబ్బతిన్న రోడ్డు పూడ్చుకుని వారంతా రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలకు ఇటుకల బొంతల మార్గం కూడా పూర్తి చిత్తడిగా మారింది. అధికారులు ఈ ఆర్అండ్‌బీ రోడ్డుపై దృష్టి పెట్టాలని ఆయా ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



చిరతపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి



మోరి గాంధీ పార్క్ వద్ద మరమ్మతులు చేసిన రోడ్డుకు పడిన గుంతలు

చిరతపూడిలో..

అంబాజీపేట: చిరతపూడిలోకి వెళ్లే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా తయారవడంతో అటుగా ప్రయాణించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారిలో గుంతలు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయి. ఆదమరచి ఆ గుంతలో పడితే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులు, రైతులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఈ రహదారిలో ప్రయాణిస్తే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



శృంగవరప్పాడు ఆంజనేయస్వామి వారి ఆలయ సమీపాన ఇటుక బొంతలతో పూడ్చిన మెయిన్ రోడ్డు

పట్టణంలో ఉచిత హోమియో వైద్య శిబిరం



ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ కేర్ వైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక జీవీ మాల్‌లో డాక్టర్ కేర్ ఆస్పత్రి వైద్యులతో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జీవీ మాల్ యాజమాని మండేల బాబి ప్రారంభించారు. డాక్టర్ కేర్ వైద్యులు నాగభూషణం, కిషోర్, ఫార్మాసిస్ట్ హేమ వైద్య సేవలు అందించారు. హోమియో వైద్యాన్ని ప్రజల్లోకి మరింత వేగంగా తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హోమియో కేర్ ఎండీ డాక్టర్ నాగభూషణం తెలిపారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రావులపాలెం: స్థానిక పరిసర ప్రాంతాలలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సీజనల్ వ్యాధులపై శ్యామ్ జాదూగర్ అవగాహన కల్పించారు. చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ మోహిత్ సమకూర్చిన ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మహా నివేదన అనంతరం వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 37 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 14 మంది దంపతులు పాల్గొన్నారు. 20 మంది తమ నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఇద్దరు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1413 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా స్వామివారికి రూ.1,28,756 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.